TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఉత్తరం
# కాకతీయ
మంగళవారం, 22 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 35 | పేజీలు: 4 వెల: 5

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- విజిలెన్స్ బృందాలతో నిరంతర తనిఖీలు, దాడులు
- అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు
- ఖనిజ వనరులతో రాష్ట్ర ఆదాయం పెంచాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



2

## బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి

*బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఉన్నతంగా ఎదగాలంటే విద్య తప్ప మరో మార్గం లేదు. బీసీలకు జ్ఞానోదయం రావాలి. బీసీలు ఉద్యమించాలి. హక్కుల కోసం పోరాడాలి. అదే సమయంలో అగ్రవర్ణాలను కూడా దూరం చేయకుండా మన ఉద్యమాన్ని వారికి వివరించి, వారిని కలుపుకొని ముందుకు సాగాలి. అప్పుడే బీసీలకు న్యాయం దక్కుతుంది.. ఉద్యమాలకు సరైన మద్దతు లభిస్తుందని.. సక్సెస్ అవుతుంది' అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల అసెంబ్లీ సీటు కాంటెస్టెడ్ బీజేపీ అభ్యర్థి, ప్రముఖ వైద్యులు పగడాల కాళీ ప్రసాదరావు అన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన బాల్యం, కుటుంబం, చదువు, వైద్య ప్రస్థానం, సామాజిక అనుభవాలు, రాజకీయ రంగ ప్రవేశం, పరకాలతో తనకున్న అనుబంధం గురించి పంచుకున్నారు. ఆయన వెల్లడించిన అనేకానేక అంశాలు ఆయన మాటల్లోనే...!*



- విద్యతోనే బీసీలు ఉన్నతమైన ఎదుగుదల సాధ్యం
- హక్కుల సాధనకు గళం విప్పాలి.. చేతనైనా పోరాటం చేయాలి
- రాజకీయాలను అసహ్యించుకుంటే ఏం ప్రయోజనం.. ఇక మార్పు ఎలా సాధ్యం..?!
- బీసీ ఉద్యమం అంటే ఓసీలను వ్యతిరేకించడం కాదు.. మన హక్కులే లక్ష్యం కావాలి
- కనిపించని కుల వివక్షే నాలో కసిని పెంచింది..ఈ స్థాయికి చేర్చిది
- వైద్యుడిగా పేదలకు న్యాయం చేయాలన్నదే నా సిద్ధాంతం
- ఈటలే నా రాజకీయ గురువు.. ఆయన వెంటే నా నడక
- పరకాల ప్రజలతోనే నా రాజకీయ ప్రయాణం
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో బీజేపీ పరకాల కాంటెస్టెడ్ అభ్యర్థి, ప్రముఖ వైద్యుడు పగడాల కాళీ ప్రసాద్‌రావు

4

## ఆశ్రమ పాఠశాలలో ఆగని అలజడి

**గిరిజన బాలికల హాస్టళ్లలో ఏం జరుగుతోంది..?**

- కరువవుతున్న భద్రత.. పర్యవేక్షణ గాలికి
- స్టడీ అవర్స్‌లో కర్రతో కొట్టిన లీడర్ విద్యార్థి.. ముగ్గురికి అస్వస్థత
- అర్ధరాత్రి విద్యార్థుల ఫోన్‌తో వెలుగులోకి ఘటన
- వార్డెన్ తీరు పై తల్లిదండ్రుల ఆగ్రహం
- వరుస ఘటనలతో హాస్టళ్ల నిర్వహణపై ప్రశ్నలు
- పర్యవేక్షణ లోపాలతోనే ఘటనలు పునరావృతం
- బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటున్న తల్లిదండ్రులు




రక్షణ కల్పించాల్సిన ఆశ్రమ పాఠశాలలోనే బాలికలకు భద్రత కరువైంది! ఏటూరునాగారం ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హాస్టల్‌లో స్టడీ అవర్స్ సమయంలో 9వ తరగతి లీడర్ విద్యార్థిని ముగ్గురు బాలికలను కర్రతో కొట్టడంతో వారు భయాందోళనకు గురై అస్వస్థతకు లోనైన ఘటన కలకలం రేపింది. వార్డెన్ అందుబాటులో లేకపోవడం, నైట్ వాచ్‌మెన్ పర్యవేక్షణలోనే విద్యార్థినులను వదిలేయడం, ఘటనపై హాస్టల్ నిర్వాహకుల నుంచి తల్లిదండ్రులకు సకాలంలో సమాచారం అందకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. అర్ధరాత్రి తోటి విద్యార్థుల ఫోన్‌తో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హాస్టల్‌కు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల ఇదే మండలంలోని మరో గిరిజన బాలికల హాస్టల్‌లో సమస్యలపై విద్యార్థినులు ఆందోళన చేసిన ఘటన మరువకముందే మరో ఘటన వెలుగులోకి రావడంతో బాలికల హాస్టళ్లలో పర్యవేక్షణ ఎక్కడ? భద్రతా చర్యలు ఏమయ్యాయి? అన్న ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి.
*- కాకతీయ, ఏటూరునాగారం*

3

## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రేషన్ డాన్ దందా!

సొంత లారీలతో రోజుకు 4 ట్రిప్పులు?

డ్రైవర్‌కూ సైతం గమ్యం తెలియ నియకుండా గుట్టుగా రవాణా

తెలంగాణలో చెక్ పోస్టులు దాటుతూ..మహారాష్ట్రలోకి వెళ్తున్న పీడీఎస్ రైస్

ఎక్కడా చేతికి మట్టి అంటకుండా పక్కగా ముందు జాగ్రత్తలు

చంద్రపూర్.. బల్లార్షా లో సొంత డెన్‌లు.. అక్కడికి చేరగానే బ్రాండెడ్ బ్యాగుల్లోకి పేదల బియ్యం

పేదల బియ్యానికి సరిహద్దుల్లో భారీ డిమాండ్

నిఘా ఉన్నా నెట్‌వర్క్ ఎలా నడుస్తోంది?



**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** అసిఫాబాద్‌కు చెందిన ఓ బడా రేషన్ స్మగ్లర్ యథేచ్ఛగా దందా సాగిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. పక్కా ప్లానింగ్, ప్రత్యేక నెట్‌వర్క్‌తో గ్రీన్‌ఫీల్డ్ హైవేల మీదుగానే రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు సమాచారం. రోజుకు 2 నుంచి 4 లారీల్లో వందల క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తూ.. సొంత లారీలను ఏర్పాటు చేసుకుని దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు..బియ్యం ఎక్కడికి చేరాలో లారీ డ్రైవర్‌కు సైతం తెలియనివ్వకుండా మధ్యలో డ్రైవర్లను మార్చేస్తున్నట్లు సమాచారం. అసిఫాబాద్ చెక్‌పోస్టు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా చంద్రపూర్, బల్లార్షాలోని సొంత స్థావరాలకు బియ్యం చేరుతున్నట్లు తెలుస్తోంది. ఇంత పకడ్బందీగా రవాణా సాగుతుంటే సంబంధిత అధికారుల నిఘా వ్యవస్థ ఏం చేస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రేషన్ డాన్ పక్కా నెట్‌వర్క్**

సదరు స్మగ్లర్ రేషన్ బియ్యం రవాణాకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. సొంత లారీలను ఉపయోగిస్తూ.. మార్గమధ్యంలో డ్రైవర్లను మార్చుతూ గమ్యస్థానానికి చేర్చుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని కిలోమీటర్లకో డ్రైవర్‌ను మార్చడం ద్వారా పూర్తి మార్గం ఒకే వ్యక్తికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్రలోని చంద్రపూర్, బల్లార్షాలో ఏర్పాటు చేసుకున్న స్థావరాలకు బియ్యాన్ని చేర్చిన తర్వాత బ్రాండెడ్ ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి పంపుతున్నట్లు తెలుస్తోంది. ప్రధాన రహదారులు, చెక్‌పోస్టులు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు దాటుకుంటూ ప్రతిరోజూ లారీల్లో వందల క్వింటాళ్ల బియ్యం వెళ్తున్నట్లు సమాచారం. అయినా ఇంత పెద్ద స్థాయిలో సాగుతున్న రవాణా అధికారుల నిఘాకు ఎందుకు చిక్కడం లేదన్నది ప్రశ్న. అప్పుడప్పుడు దాడులు చేసి కొంత బియ్యం పట్టుకోవడం మినహా.. అసలు మూలాలను గుర్తించే ప్రయత్నం ఎంతవరకు జరుగుతోందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రవాణా మార్గాలు, లారీల కదలికలు, నిల్వ కేంద్రాలు, కొనుగోలు చేసే వ్యక్తులపై సమగ్ర నిఘా పెడితేనే అసలు నెట్‌వర్క్ బయటపడే అవకాశం ఉంది.

**జిల్లాల సరిహద్దులే అడ్డాగా?**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, ఐబీ తాండూర్,

........(తరువాయి 2లో)

## హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణ కేంద్రం

- టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- కొత్త తరహా ఆలోచనలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



2

## జూరాలలో నీళ్లు నిల్వ చేయలేని పరిస్థితి తెచ్చారు

- 5.50 లక్షల ఎకరాలకు అదనపు రిజర్వాయర్ ఎందుకు కట్టలేదు?
- గూడెందొడ్డి రిజర్వాయర్‌కు రూ.15 టీఎంసీలతో జీవో
- వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు



2

## డిప్యూటేషన్ దందా!

- వైద్యశాఖలో ఇదో నిత్యకృత్యం!
- పోస్టింగ్ ఎక్కడైనా.. విధులు మాత్రం ఇష్టమైన చోటే!
- పైరవీలతో డిప్యుటేషన్.. పల్లె దవాఖానాలకు గండం
- నగరానికి రావడమే లక్ష్యంగా మంత్రాంగం
- కొందరికి నిబంధనలు.. మరికొందరికి మినహాయింపులు?
- మారుమూల పోస్టింగులు ఎవరికి.. డిప్యుటేషన్లు ఎవరికి?



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్ల దందా సర్వసాధారణంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఖాళీలను భర్తీ చేసి ప్రజలకు వైద్యం అందించాల్సిన వైద్యులు, సిబ్బంది.. పోస్టింగ్ ఒకచోట ఉన్నా విధులు మాత్రం తమకు అనుకూలమైన చోటే నిర్వహించే పరిస్థితులు నెలకొంటున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల వద్ద పైరవీలు, పలుకుబడితో నగర ప్రాంతాలకు డిప్యుటేషన్లపై వచ్చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పల్లెల్లోని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత ఏర్పడుతుండగా.. నగర ప్రాంతాల్లో మాత్రం అవసరానికి మించి సిబ్బంది ఉండే పరిస్థితి కనిపిస్తోంది. ప్రజలకు అత్యవసరంగా వైద్య సేవలు అందాల్సిన శాఖలోనే పోస్టింగ్, విధుల మధ్య ఈ అంతరం కొనసాగడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**డిప్యుటేషన్ అంటే.. దర్జాగా బదిలీనా?**

వాస్తవానికి డిప్యుటేషన్

........(తరువాయి 2లో)



- ప్రభుత్వ నిఘా ఉన్నా ఆగని దందా!
- తెర వెనుక జరుగుతున్న తతంగం ఏంటి?
- మార్కెట్ ప్రమేయం లేకుండానే మిర్చి తరలింపు?
- పట్టీలు.. వే బ్రిడ్జి స్లిప్పుల మధ్య పొంతన ఉందా?

## కోల్డ్ 'చోరేజీలు'!

**ఏనుమాములలో జీరో చీకటి వ్యాపారం**

కోల్డ్ స్టోరేజీల మాటున 'జీరో' చీకటి దందా సాగుతోందా? ఏనుమాముల మార్కెట్ పరిధిలో రైతుల మిర్చి బస్తాలు మార్కెట్ యార్డు ప్రమేయం లేకుండానే బయటకు తరలుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక తనిఖీ బృందాలను రంగంలోకి దించినా.. క్షేత్రస్థాయిలో అక్రమ లావాదేవీలపై అనుమానాలు మాత్రం తొలగడం లేదు. మార్కెట్‌లో తూకం వేయకుండా ప్రైవేటు వే బ్రిడ్జిల వద్ద తూకాలు వేసి మిర్చిని తరలిస్తున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. దీంతో కోల్డ్ స్టోరేజీల స్టాక్ రిజిస్టర్లు, మార్కెట్ పట్టీలు, వ్యాపారుల కొనుగోలు వివరాలు, వే బ్రిడ్జి స్లిప్పులను సరిపోల్చితే అసలు లెక్క తేలుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిఘా, ప్రత్యేక తనిఖీలు ఉన్నా ఈ 'చీకటి' దందా సాగుతుంటే.. తెరవెనుక ఎవరి అండ ఉంది? మార్కెట్ ప్రమేయం లేకుండా మిర్చి తరలింపుపై అధికారులు లోతుగా తనిఖీ చేస్తారా? *- కాకతీయ, వరంగల్ ప్రతినిధి*

3

# డిప్యుటేషన్ దందా!

(మొదటిపేజీ తరువాయి)



అనేది ప్రత్యేక పరిస్థితుల్లో అవసరాన్ని బట్టి కల్పించే వెసులుబాటు. కానీ వైద్యారోగ్యశాఖలో మాత్రం కొందరికి ఇది శాశ్వత ఏర్పాటుగా మారుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో పోస్టింగ్ వచ్చినా అక్కడ పనిచేయకుండా.. తమకు అనుకూలమైన ప్రాంతానికి డిప్యుటేషన్‌పై వచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకసారి నగరానికి చేరిన తర్వాత తిరిగి అసలు పోస్టింగ్ ప్రాంతానికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాల్సిన వ్యవస్థకు నష్టం కలుగుతోంది. ఉద్యోగి ఒకచోట పోస్టింగ్ పొంది మరోచోట పనిచేస్తే.. అసలు పోస్టింగ్ ఉన్న ప్రాంతం పరిస్థితి ఏమిటన్నదే కీలక ప్రశ్న. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది అందుబాటులో లేకపోతే అక్కడి ప్రజలు వైద్యం కోసం మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలను బలోపేతం చేయాలనే లక్ష్యానికి డిప్యుటేషన్ల విధానం విరుద్ధంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో పనిచేసే సిబ్బంది నగరాలకు రావడానికి ఆసక్తి చూపడం వల్ల పల్లె దవాఖానాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది.

**నగరమే కావాలి.. ఎందుకంటే?**

మారుమూల ప్రాంతాల్లో రోగుల సంఖ్య తక్కువగా ఉండటం, నగర ప్రాంతాల్లో ప్రైవేటు ప్రాక్టీస్‌కు అనుకూల పరిస్థితులు ఉండటం వంటి కారణాలతో కొందరు సిబ్బంది నగరాల వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారుల వద్ద పైరవీలు చేసుకుని తమకు అనుకూలమైన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకవైపు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటుంటే.. మరోవైపు డిప్యుటేషన్ల పేరుతో సిబ్బంది నగరాలకు చేరితే ఆ చర్యల ఉద్దేశమే దెబ్బతింటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వందల మందికి డిప్యుటేషన్లు?**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో డిప్యుటేషన్లపై పనిచేస్తున్న వారి సంఖ్య గణనీయంగానే ఉన్నట్లు కథనంలో పేర్కొన్న సమాచారం చెబుతోంది. సుమారు 320 మంది వరకు డిప్యుటేషన్‌పై పనిచేస్తుండగా.. ఒక్క హనుమకొండ జిల్లాలోనే 55 మంది ఉన్నట్లు సమాచారం. ఇందులో ఒప్పంద ఉద్యోగులతో పాటు సీనియర్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, నర్సులు, హెడ్‌నర్సులు, ఎంబీబీఎస్ వైద్యులు ఉన్నట్లు సమాచారం. ఇంత పెద్ద సంఖ్యలో సిబ్బంది అసలు పోస్టింగ్ ప్రాంతాలను వదిలి ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుంటే.. వారి అవసరం ఎక్కడ ఉంది? డిప్యుటేషన్ ఇచ్చిన ప్రాతిపదిక ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డిప్యుటేషన్‌కు సంబంధించి అధికారిక ఉత్తర్వులు జారీ అవుతున్నప్పటికీ.. వాటి వెనుక ఉన్న అవసరాలను పరిశీలిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరికి అత్యవసరంగా డిప్యుటేషన్ అవసరమైంది? ఎన్ని రోజుల కోసం ఇచ్చారు? గడువు ముగిసిన తర్వాత ఎందుకు వెనక్కి పంపడం లేదు? అసలు పోస్టింగ్ ఉన్న ప్రాంతంలో ప్రత్యామ్నాయ సిబ్బంది ఉన్నారా? అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒక ఉద్యోగికి ఇచ్చిన డిప్యుటేషన్ వల్ల మరో ప్రాంతంలోని వైద్య సేవలకు నష్టం కలుగుతుంటే.. దానిపై బాధ్యత ఎవరిది అన్నది కూడా స్పష్టంగా తేల్చాల్సి ఉంది.

**అధికారుల తనిఖీల్లోనూ అదే తీరు**

డిప్యుటేషన్ల వ్యవహారమే కాకుండా కొందరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? అనే అంశంపైనా ప్రశ్నలు ఉన్నాయి. ఎంజీఎం, కేఎంసీల్లో పనిచేసే కొందరు వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో సేవలు అందించకుండా ప్రైవేటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నట్లు కథనంలో పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీల్లో కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చినా.. పరిస్థితిలో ఆశించిన మార్పు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డిప్యుటేషన్లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి? ఎన్ని అవసరం లేకుండానే కొనసాగుతున్నాయి? అనే అంశాలను తేల్చాల్సిన అవసరం ఉంది. ఒకచోట పోస్టింగ్ పొందిన ఉద్యోగి మరోచోట విధులు నిర్వహించడం, మరికొందరు నగర ప్రాంతాల్లోనే కొనసాగడం వంటి పరిణామాలు వైద్యారోగ్యశాఖలో పర్యవేక్షణ లోపాలను బయటపెడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలోని ఓ మండల పీహెచ్‌సీలో పోస్టింగ్ ఉన్న హెడ్‌నర్సు నగర సమీపంలోని కార్యాలయంలో పనిచేస్తున్నట్లు, మరికొందరు సిబ్బంది కూడా డిప్యుటేషన్‌పై నగరంలోనే కొనసాగుతున్నట్లు కథనంలో పేర్కొన్నారు. ఇలాంటి వ్యవహారాలపై అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఉంది.

**"మూడు గంటలకే మమ"**

ప్రభుత్వ వైద్యులు పూర్తి సమయం విధుల్లో ఉండి ప్రజలకు సేవలందించాల్సి ఉండగా.. కొందరు మూడు గంటలకు మించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయడం లేదన్న ఫిర్యాదులు ఉన్నట్లు కథనంలో పేర్కొన్నారు. ప్రైవేటు ప్రాక్టీస్‌కు వెళ్లేందుకు ప్రభుత్వ విధులను పక్కన పెడుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. అయితే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు వాస్తవంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్లపై సమగ్ర సమీక్ష నిర్వహించాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రతి డిప్యుటేషన్‌కు కారణం, గడువు, అవసరం, అసలు పోస్టింగ్ ప్రాంతంపై దాని ప్రభావాన్ని పరిశీలించాలి. ముఖ్యంగా పల్లె దవాఖానాల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఉండకుండా చర్యలు తీసుకోవాలి. డిప్యుటేషన్ అనేది ఉద్యోగి సౌకర్యానికి కాకుండా శాఖ అవసరానికి ఉపయోగపడే విధంగా ఉండాలి. లేదంటే మారుమూల ప్రాంతాల్లోని పేదలకు ప్రభుత్వ వైద్యం అందక.. నగరాల్లో మాత్రం ఉద్యోగుల సౌకర్యాలు పెరుగుతున్న పరిస్థితి కొనసాగుతుంది. వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్ల దందాకు అడ్డుకట్ట వేసి.. ఎవరి పోస్టింగ్ వారికి, ఎవరి విధులు వారికి అప్పగించేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు, అనధికారిక ఖనిజాల తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేపట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్రమ ఇసుక రవాణా, తవ్వకాలపై వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

**ఖాళీల భర్తీ, పదోన్నతులు వేగవంతం**

ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సంజయ్ జాజు తెలిపారు. శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కొరతతో శాఖ కార్యకలాపాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా గనులు, భూగర్భ వనరుల శాఖను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ ఆదాయం పెంచేలా సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ జనరల్ (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్) డి.ఎస్.చౌహాన్, ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ మైన్స్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రేషన్ డాన్ దందా!

(మొదటిపేజీ తరువాయి)

రెబ్బెన ప్రాంతాల నుంచి కూడా రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు సమాచారం. సిర్పూర్ నియోజకవర్గంలోని బెజ్జూరు, కౌటాల, సిర్పూర్(టి), చింతలమానేపల్లి మండలాల్లో రేషన్ బియ్యం సేకరణ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని తినేందుకు కొంతమంది లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో దళారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇంట్లో దొడ్డు బియ్యం వినియోగించని కొందరు కిలోకు సగటున రూ.10 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో దళారులు ఇంటింటికీ తిరిగి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్రలో ఈ బియ్యానికి డిమాండ్ ఉండటంతో కిలో రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేసి అక్కడ రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేసే సమయంలోనే దళారులు లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. కొంతమంది డీలర్లు కూడా దళారులతో చేతులు కలిపి వ్యవహారం నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డీలర్లు నేరుగా బయటకు రాకుండా దళారుల ద్వారా బియ్యం సేకరించి వచ్చిన ఆదాయాన్ని పంచుకుంటున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై సంబంధిత అధికారులు లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

**ప్రాణహిత వంతెనతో రాచమార్గం**

కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల సరిహద్దులో ప్రాణహిత నదిపై గూడెం వద్ద వంతెన పూర్తికావడంతో అక్రమ రవాణాకు మార్గం మరింత సులభమైందన్న అభిప్రాయాలు ఉన్నాయి. రాత్రివేళల్లో ద్విచక్రవాహనాలు, బొలేరోలు, ఆటోల ద్వారా బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు సమాచారం. సిర్పూర్ నుంచి రైళ్ల ద్వారా కూడా బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పలు మార్గాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. సిర్పూర్-కాగజ్‌నగర్ నుంచి చంద్రపూర్, బల్లార్షా, గోండియా వైపు, మంచిర్యాల-చెన్నూర్ మీదుగా సిరోంచకు బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. జన్నారం, ఖానాపూర్, నిర్మల్ మీదుగా హిమాయత్‌నగర్, కిన్వట్, యవత్మాల్, లాతూర్, నాందేడ్ ప్రాంతాలకు, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మీదుగా జీవితి, గడ్‌చందూర్ ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఆదిలాబాద్ మీదుగా బోరి, ఇంగన్‌ఘాట్, నాగ్‌పూర్, గోండియాకు కూడా తరలింపు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## వైద్య విద్యార్థిని అకీరాకు కేటీఆర్ ఆర్థిక సాయం

- ఎంబీబీఎస్ చదువుకు రూ.2 లక్షలు అందజేత
- వైద్య విద్య పూర్తయ్యే వరకు అండగా ఉంటానని హామీ



**కాకతీయ, హైదరాబాద్:** ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వర్ధన్నపేటకు చెందిన కొండేటి అకీరాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఎంబీబీఎస్ చదువును కొనసాగించేందుకు సోమవారం తెలంగాణ భవన్‌లో అకీరాకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. వర్ధన్నపేటకు చెందిన కొండేటి భాస్కర్, అనిత దంపతుల కుమార్తె అకీరా తుర్రూరులో పదో తరగతి, ఖమ్మంలోని అంబేడ్కర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. జాతీయ వైద్య ప్రవేశ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 2,99,946 ర్యాంకు, ఎస్సీ విభాగంలో 27,865 ర్యాంకు సాధించి పటాన్‌చెరువులోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందారు. అకీరా పరిస్థితిని జర్నలిస్ట్ బొల్లెపాక రాజేష్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కేటీఆర్ ఆర్థిక సహాయం అందిస్తానని ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షలు అందించారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు అండగా ఉంటానని, అకీరా వైద్య విద్య పూర్తయ్యే వరకు భవిష్యత్తులోనూ సహాయం చేస్తానని తెలిపారు. వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. కేటీఆర్ సహాయంతో తన చదువును కొనసాగించేందుకు మరింత ధైర్యం వచ్చిందని అకీరా తెలిపింది.

## హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణ కేంద్రం

- టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- కొత్త తరహా ఆలోచనలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




**కాకతీయ, హైదరాబాద్ :** దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్‌కు ప్రధాన కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్టార్టప్‌ల సామర్థ్యాలను హెల్త్‌కేర్‌తో అనుసంధానిస్తూ సమగ్ర ఇన్నోవేషన్ ఎకోసిస్టంను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. టీహబ్‌లో 'బియాండ్ నంబర్స్-ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర్' అంశంపై నిర్వహించిన 'హోమా సీఎంఈ 2026' జాతీయ సదస్సును సోమవారం ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మెడిసిన్‌ను టెక్నాలజీతో మిళితం చేస్తున్నామని అన్నారు. ఆధునిక జీవనశైలి కారణంగా డయాబెటిస్, ఇతర మెటబాలిక్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో లైఫ్‌స్టైల్ డేటాను విశ్లేషించడం ద్వారా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు మరిన్ని ఆవిష్కరణలు అవసరమన్నారు. హెల్త్‌కేర్ రంగంలోని భవిష్యత్ సవాళ్లను పరిష్కరించే కొత్త ఆలోచనలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రముఖ వైద్యులు డా. ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్'ను ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎంపిక చేసిన 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్ అందించే 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ (పీవోసీ)' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

## జూరాలలో నీళ్లు నిల్వ చేయలేని పరిస్థితి తెచ్చారు

- 5.50 లక్షల ఎకరాలకు అదనపు రిజర్వాయర్ ఎందుకు కట్టలేదు?
- గూడెందొడ్డి రిజర్వాయర్‌కు రూ.15 టీఎంసీలతో జీవో
- వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** పదేళ్ల పాలనలో రిజర్వాయర్లు నిర్మించకపోవడం వల్లే ప్రస్తుతం జూరాల ఆయకట్టులో నీటి ఎద్దడి పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. శ్రీశైలం నుంచి ఇప్పటివరకు నాగార్జునసాగర్‌కు నేరుగా చుక్క నీరు కూడా వదలలేదని, విద్యుదుత్పత్తి ద్వారా మాత్రమే కొంత నీరు సాగర్‌కు చేరిందని తెలిపారు. జూరాలకు ప్రస్తుతం 300 క్యూసెక్కులు కూడా రావడం లేదని చెప్పారు. జూరాలలో 3 టీఎంసీల వరకు పూడిక ఉండటంతోపాటు మరో 2 టీఎంసీలను తాగునీటి అవసరాల కోసం నిల్వ చేయాల్సి ఉందన్నారు. 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని జూపల్లి ప్రశ్నించారు. 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్ నిర్మిస్తామని గతంలో కేసీఆర్ ప్రకటించినా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి తమ ప్రభుత్వం జీవో ఇచ్చి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని ముందుగానే సూచించామని చెప్పారు. కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నామని, వర్షాకాలం ఇంకా ఉన్నందున ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నీటి కేటాయింపుల విషయంలో తమ ప్రభుత్వం రాజీపడదని స్పష్టం చేశారు.

**ప్రాజెక్టులపై కేటీఆర్‌కు అవగాహన లేదు**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామని, 7 లక్షల ఎకరాలకు నీరందించామని కేటీఆర్ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని జూపల్లి అన్నారు. నార్లాపూర్ పంపులు ప్రారంభం కావడానికి ఇంకా సమయం పడుతుందని తెలిపారు. కల్వకుర్తి లిఫ్ట్ మోటార్లు సాధారణంగానే పనిచేస్తున్నాయని చెప్పారు. గత పాలనలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయలేదని విమర్శించారు. కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను వినియోగించుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపుపై న్యాయపరమైన పోరాటం కొనసాగుతోందని తెలిపారు. వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని జూపల్లి హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి అదనంగా రూ.20 వేల కోట్లు ఇవ్వాలని ఇప్పటికే కోరినట్లు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయ లబ్ధి కోసం రైతులను రెచ్చగొట్టకుండా రైతుల్లో మనోధైర్యం నింపాలని సూచించారు. జూరాలకు వెళ్లడం కంటే బీజేపీ నాయకులు ప్రధాని వద్దకు వెళ్లి రాష్ట్రానికి రూ.20 వేల కోట్లు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలని అన్నారు.

## ఎంజీఎంలో పెచ్చులూడిన ఘటనపై ప్రభుత్వం సీరియస్

- పాత భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జె. చోంగ్తు ఆదేశం



**కాకతీయ, వరంగల్ :** ఎంజీఎం ఆసుపత్రిలో పెచ్చులు ఊడిపడిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జె. చోంగ్తు, ఐఏఎస్ సీరియస్‌గా స్పందించారు. సోమవారం ఆమె ఎంజీఎం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, నిన్న పెచ్చులు ఊడిన ఆరోగ్యశ్రీ వార్డును పరిశీలించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, భవనం స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనాల భద్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌అండ్‌బీ ఈఈ నరేందర్‌రెడ్డి, టీఎస్‌ఎంఐడీసీ ఈఈ ప్రసాద్‌లను ఆదేశించారు. పాత భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. అనంతరం వివిధ విభాగాలను పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ హాజరు వివరాలను పరిశీలించిన ఆమె సమయపాలనతో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పారిశుద్ధ్యం, మందుల లభ్యత, పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పర్యటనలో రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డా. వాణి, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రామ్‌కుమార్‌రెడ్డి, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం..



**కాకతీయ, రుద్రంగి:** గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని రుద్రంగి ఒకటో వార్డు సభ్యురాలు గసికంటి ప్రేమల రాజు అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఒకటో వార్డు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ అంబటి సరిత ఆధ్వర్యంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని గ్రామ కార్యదర్శి స్వామి సూచించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## మట్టి గణపతికి ప్రోత్సాహం..

**కిషన్‌పుర జై భవాని కమిటీకి ప్రథమ బహుమతి**



**కాకతీయ, హనుమకొండ :** ఛత్రపతి శివాజీ మహారాజు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మట్టి గణపతి విగ్రహాల తయారీని ప్రోత్సహిస్తూ నిర్వహించిన మట్టి గణపతి బెస్ట్ అవార్డు కార్యక్రమం ఘనంగా జరిగింది. పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటీలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌పుర జై భవాని కమిటీ సభ్యులు మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. మాజీ శాసనసభ సభ్యులు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై జై భవాని కమిటీ సభ్యులకు ప్రథమ బహుమతిని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. మట్టి గణపతి విగ్రహాల వినియోగం ద్వారా చెరువులు, నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. యువత, ఉత్సవ కమిటీలు పర్యావరణ హిత విగ్రహాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజు అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాల తయారీ, వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు పర్యావరణహిత వినాయక ఉత్సవాలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో జాప్యం సహించేది లేదు

- ప్రజావాణిలో 94 వినతులు స్వీకరణ
- టౌన్ ప్లానింగ్‌పై 41 ఫిర్యాదులు
- బల్దియా కమిషనర్ టి. వెంకన్న స్ట్రాంగ్ వార్నింగ్

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం, జాప్యాన్ని ఎంతమాత్రం సహించబోమని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను హెచ్చరించారు. ప్రజల వినతులకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యమన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 94 వినతులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ 41, ఇంజినీరింగ్ 29, ఆరోగ్యం, పారిశుద్ధ్యం 10, రెవెన్యూ 8, నీటి సరఫరా 5, హార్టికల్చర్ 1 చొప్పున ఉన్నాయి. టౌన్ ప్లానింగ్‌కు అత్యధికంగా 41 ఫిర్యాదులు రావడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని సూచించారు. గత వారం వినతుల పరిష్కార స్థితిగతులను కమిషనర్ సమీక్షించి, పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. అనవసర జాప్యం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు..

**ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్**

**కాకతీయ, ఏటూరునాగారం :** గిరిజన దర్బార్‌లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీఓ గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 27 దరఖాస్తులు అందాయి. వీటిలో విద్యా విభాగానికి సంబంధించి 15, పోడు భూములకు 3, జీవనోపాధికి 4, బోర్‌వెల్, విద్యుత్ లైన్‌కు 2, మావోయిస్టుల లొంగుబాటు అనంతరం జీవనోపాధికి సంబంధించి ఒక దరఖాస్తు ఉన్నాయి. ట్రైబల్ రిలీఫ్ ఫండ్‌కు 2, గ్రామ పంచాయతీ భవనం పెండింగ్ పనులకు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దర్బార్‌ను ఆశ్రయిస్తున్నందున వారి దరఖాస్తులపై నిర్లక్ష్యం లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని పీఓ సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి అర్జీల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ జానార్ధన్, ఏపీఓ దామోదర స్వామి, ఏఓ అనిల్‌కుమార్, ఈఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



**కాకతీయ, పెద్దవంగర :** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దవంగర ఎంపీడీవో రామ్మోహన్ తెలిపారు. సోమవారం పెద్దవంగర రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు.ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు వ్యాపారులకు డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు

- రూ. 4.20 లక్షల వరకు అక్రమ వసూళ్లు
- పోలీస్ యూనిఫాం, మొబైల్ ఫోన్ స్వాధీనం
- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్




**కాకతీయ, మహబూబాబాద్ :** పోలీసులుగా నటిస్తూ బంగారు వ్యాపారులను ఫోన్‌లో బెదిరించి 'డిజిటల్ అరెస్ట్' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి పోలీస్ యూనిఫాం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. నిడమనూరుకు చెందిన షేక్ ఇర్ఫాన్ (29), చింతలచేరువు ప్రశాంత్ (26) నిందితులుగా గుర్తించారు. ఇర్ఫాన్ పోలీస్ యూనిఫాం ధరించి ఫొటో తీసుకుని వాట్సాప్, ట్రూకాలర్‌లో డీపీగా పెట్టుకున్నాడు. కేసముద్రం మండలానికి చెందిన బంగారు వ్యాపారి బోగోజు వేణుగోపాలచారికి ఫోన్ చేసి తాను వికారాబాద్ సమీపంలోని పార్వతీపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐనంటూ పరిచయం చేసుకున్నాడు. ఇద్దరు దొంగలను పట్టుకున్నామని, వారు దొంగిలించిన బంగారాన్ని వ్యాపారి కొనుగోలు చేశాడంటూ బెదిరించి వాట్సాప్‌లో క్యూఆర్ కోడ్ పంపి రూ. 88,026 వసూలు చేశాడు. సాంకేతిక ఆధారాలు, సైబర్ క్రైమ్ పోర్టల్ వివరాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్ల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు 20092026న అరెస్ట్ చేశారు. 15082026 నుంచి 15092026 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బంగారు వ్యాపారుల నుంచి సుమారు రూ. 4,20,000 వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలోనూ వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. పోలీసుల పేరుతో వచ్చే అనుమానాస్పద కాల్స్, క్యూఆర్ కోడ్‌లకు స్పందించవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు పాల్గొన్నారు.

# నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏసీబీ దాడులు

**లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మున్సిపల్ ఉద్యోగులు**



**కాకతీయ, నిజామాబాద్ :** రూ.15 వేల లంచం తీసుకుంటూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ పాల్దా అశోక్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కలకుంట్ల కిరణ్‌కుమార్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిజామాబాద్‌లోని పద్మశాలి సంఘం వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ఇద్దరినీ అరెస్ట్ చేసిన అధికారులు తదుపరి చర్యల్లో భాగంగా హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తున్నారు.లంచం డిమాండ్ చేస్తే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ నంబర్ 9440446106కు సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను రహస్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# కార్తీక్ అకాల మృతి బాధాకరం: ఎమ్మెల్యే మురళీ నాయక్



**కాకతీయ, నెల్లికుదురు:** మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన మద్దెల కార్తీక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. భూక్య మురళీ నాయక్ శ్రీరామగిరికి చేరుకుని కార్తీక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ కార్తీక్ అకాల మృతి కలచివేసిందన్నారు. కుటుంబాన్ని చూసుకోవాల్సిన కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి మాదరి ప్రశాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎదళ్ల యాదవ రెడ్డి, ఉపసర్పంచ్ రామగిరి సుమన్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, బాలాజీ నాయక్, బెల్లి నర్సయ్య, డోనికెన మల్లయ్య, కుటుంబ సభ్యులు సుచరిత, మద్దెల భద్రయ్య, డా.ప్రభాకర్, మద్దెల పవన్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు




**కాకతీయ,శంకరపట్నం:**మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్‌లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దపాక జడ్పీహెచ్ఎస్‌లో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమ్యశ్రీ, గద్దపాక ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ బక్కి అనితలను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి పురస్కారాలను అందజేశారు. ఎమ్మార్వో కె. సురేఖ, ఎంఈఓ లక్ష్మీనారాయణ, హెచ్ఎంలు భూమిరెడ్డి, కంకనాల నీరజ, సుభాష్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులను క్రమశిక్షణతో, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించి మండల స్థాయి పురస్కారాలకు ఎంపికైన రమ్యశ్రీ, బక్కి అనితలను పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు అభినందించారు.

# రుద్రంగిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ..!



**కాకతీయ, రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. లబ్ధిదారులు పున్నూరి మల్లవ్వ, రేగుల మల్లవ్వలకు మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ గండి నారాయణ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఇళ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు తర్రె లింగం, ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కోల్డ్ 'చోరేజీలు'!

- ఏనుమాములలో జీరో చీకటి వ్యాపారం
- ప్రభుత్వ నిఘా ఉన్నా ఆగని దందా!
- తెర వెనుక జరుగుతున్న తతంగం ఏంటి?
- మార్కెట్ ప్రమేయం లేకుండానే మిర్చి తరలింపు?
- పట్టీలు.. వే బ్రిడ్జి స్లిప్పుల మధ్య పొంతన ఉందా?

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన ఏనుమాముల మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజీల చుట్టూ అనుమానాలు ముసురుకుంటున్నాయి. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చిని భద్రపరచాల్సిన కోల్డ్ స్టోరేజీలు.. అక్రమ లావాదేవీలకు అడ్డాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్ యార్డు ప్రమేయం లేకుండా మిర్చి బస్తాలను బయటకు తరలిస్తూ 'జీరో' వ్యాపారం సాగిస్తున్నారన్న ఆరోపణలు బలపడుతుండటంతో.. ప్రభుత్వ నిఘా ఉన్నా దందా ఎలా సాగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల ఖమ్మం మార్కెట్ యార్డులో ధరల్లో వ్యత్యాసం(ఆర్డీ) వ్యవహారంలో వ్యాపారులు మార్కెట్ కమిటీపై ఒత్తిడి తీసుకొచ్చి లావాదేవీలు నిలిపివేస్తామని హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కోల్డ్ స్టోరేజీల్లో జరుగుతున్న జీరో దందా, ఆర్డీ ఎగవేతను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గత నెల 14న కరీంనగర్ నుంచి వచ్చిన మార్కెట్ సెక్రటరీలు, వ్యవసాయ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం ఏనుమాముల మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. మిర్చి బస్తాల లావాదేవీలు, స్టాక్ రిజిస్టర్లు, పట్టీలను పరిశీలించింది. తనిఖీలు జరుగుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో జీరో దందా కొనసాగుతోందన్న ఆరోపణలు మాత్రం వినిపిస్తున్నాయి.

**తెర వెనుక జరుగుతున్న తతంగం ఏంటి?**

కొందరు ఖరీదుదారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కై వందలాది మిర్చి బస్తాలను మార్కెట్ యార్డు ప్రమేయం లేకుండానే కోల్డ్ స్టోరేజీల నుంచి నేరుగా బయటకు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్‌లో తూకం వేయకుండా ప్రైవేటు వే బ్రిడ్జిల వద్ద తూకం వేసి లావాదేవీలు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఇలాంటి లావాదేవీలు వాస్తవమైతే ప్రభుత్వానికి రావాల్సిన మార్కెట్ ఫీజుకు భారీగా గండిపడే అవకాశం ఉంది. మిర్చి బస్తాల కొనుగోలు, తరలింపు వివరాలు మార్కెట్ రికార్డుల్లో నమోదవుతున్నాయా? లేదా అనే అంశం ఇప్పుడు కీలకంగా మారింది. ఈ వ్యవహారంపై రైతులు, దాడువాయిలు మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**పట్టీలు.. స్లిప్పులు సరిపోతున్నాయా?**

కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న మొత్తం మిర్చి బస్తాల లెక్క తేల్చడంతోపాటు.. ఏ వ్యాపారి ఎన్ని బస్తాలు కొనుగోలు చేశాడు? ఎన్ని బస్తాలు బయటకు తరలించాడు? కొనుగోలు చేసిన బస్తాలకు సంబంధించిన పట్టీలను మార్కెట్‌కు సక్రమంగా సమర్పించారా? ప్రైవేటు వే బ్రిడ్జి స్లిప్పుల్లో నమోదైన బరువుకు మార్కెట్ పట్టీల్లోని వివరాలకు పొంతన ఉందా? అనే అంశాలపై లోతుగా విచారణ జరపాలని రైతులు కోరుతున్నారు. స్టాక్ రిజిస్టర్లు, మార్కెట్ పట్టీలు, వే బ్రిడ్జి స్లిప్పులు, వ్యాపారుల కొనుగోలు వివరాలను పరస్పరం సరిపోల్చితే అక్రమ లావాదేవీలకు సంబంధించి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**ఏం చేస్తే బండారం బయటపడుతుంది?**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు కేవలం రిజిస్టర్ల పరిశీలనకే పరిమితం కాకుండా.. కోల్డ్ స్టోరేజీల్లోకి వచ్చిన, బయటకు వెళ్లిన ప్రతి మిర్చి బస్తా లావాదేవీని క్షుణ్ణంగా పరిశీలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ రికార్డులు, వ్యాపారుల పట్టీలు, వే బ్రిడ్జి స్లిప్పులను క్రాస్‌చెక్ చేయాలని కోరుతున్నారు. కోల్డ్ స్టోరేజీల్లో నిజంగా జీరో దందా జరుగుతోందా? మార్కెట్ ఫీజుకు గండి పడుతోందా? అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానం రావాలంటే సమగ్ర తనిఖీతోపాటు లోతైన విచారణ అవసరమని రైతులు చెబుతున్నారు. మార్కెట్ ఆదాయానికి నష్టం కలిగించే అక్రమ లావాదేవీలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# 17వ వసంతంలోకి యంగ్ స్టార్స్ యూత్!

- సేవా స్ఫూర్తితో 17 ఏళ్ల ప్రస్థానం
- 2009లో మొదలై.. గ్రామ యువతకు ఐక్యతా వేదికగా
- పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడితో నవరాత్రులు
- వావిలాల గణేష్ లడ్డూకు ప్రత్యేక గుర్తింపు
- స్థాపకుల బాటలో కొత్త నాయకత్వం.. సేవా కార్యక్రమాలే లక్ష్యంగా ముందుకు







**కాకతీయ, మహబూబాబాద్ :** ఒక చిన్న ఆలోచనగా మొదలైన యంగ్ స్టార్స్ యూత్.. 17వ వసంతంలోకి అడుగుపెట్టి గ్రామ యువతకు ఐక్యత, సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోంది. 2009లో బైరి రంజిత్‌కుమార్, మద్దెల రాజేష్ ఆలోచనతో ప్రారంభమైన యూత్ అసోసియేషన్.. కొద్దిమంది యువకులతో మొదలై నేడు గ్రామంలోని పలువురు యువతను ఒక్కతాటిపైకి తీసుకొచ్చే స్థాయికి ఎదిగింది. యువత అంటే వినోదానికే పరిమితం కాదని.. గ్రామానికి అవసరమైన సమయంలో ముందుండి సేవ చేయవచ్చని యంగ్ స్టార్స్ యూత్ తమ కార్యక్రమాలతో చాటుతోంది. వినాయక నవరాత్రుల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ వావిలాలలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పర్యావరణహిత విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు భక్తి, సామాజిక బాధ్యతను కలగలిపి ఉత్సవాలను నిర్వహించడం యూత్ ప్రత్యేకతగా నిలుస్తోంది. హైదరాబాద్‌లో ఖైరతాబాద్ గణేష్‌కు ఎంతటి గుర్తింపు ఉందో.. వావిలాలలో యంగ్ స్టార్స్ యూత్ గణేష్ లడ్డూకు అంతే ప్రత్యేకత ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

**లడ్డూకు భారీ డిమాండ్**

యంగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గణేష్ లడ్డూను వేలం పాటలో దక్కించుకునేందుకు ప్రతి ఏటా భక్తులు ఆసక్తి చూపుతున్నారు. లడ్డూను దక్కించుకున్న వారికి అంతా మంచే జరుగుతుందన్న విశ్వాసంతో వేలం పాటలో పోటీ పడుతున్నారు. దీంతో వినాయక నవరాత్రుల్లో వావిలాల లడ్డూ వేలం ప్రత్యేక ఆకర్షణగా మారింది.

యంగ్ స్టార్స్ యూత్‌కు బలమైన పునాదులు వేసిన బైరి రంజిత్‌కుమార్, మద్దెల రాజేష్ 15 ఏళ్లపాటు యువతను సమన్వయం చేస్తూ సంస్థను ముందుకు నడిపించారు. వారు పెంపొందించిన ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తి నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం అధ్యక్షుడు నాళ్లం రఘుపతి, ఉపాధ్యక్షుడు మారగాని అశోక్ ఆధ్వర్యంలో యువత సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

**పండుగలకే పరిమితం కాకుండా..**

యంగ్ స్టార్స్ యూత్ కార్యక్రమాలు కేవలం పండుగల నిర్వహణకే పరిమితం కావడం లేదు. గ్రామంలో సామాజిక సేవ, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యమవుతోంది. గ్రామ అవసరాలను గుర్తించి అందుబాటులో ఉన్నంత మేరకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. 'ఒక్కరి కోసం అందరం.. అందరి కోసం ఒక్కరం' అనే స్ఫూర్తితో యంగ్ స్టార్స్ యూత్ 17వ వసంతంలోకి అడుగుపెట్టింది. స్థాపకులు వేసిన సేవా పునాదులను కొనసాగిస్తూ.. కొత్త నాయకత్వంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు యువత సిద్ధమవుతోంది. గ్రామ యువతను ఒక్కతాటిపైకి తీసుకొచ్చే వేదికగా 17 ఏళ్లుగా కొనసాగుతున్న యంగ్ స్టార్స్ యూత్ ప్రస్థానం.. వావిలాల గ్రామంలో యువత ఐక్యతకు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది.

# విద్యార్థులను ప్రోత్సహించాలనే సైకిళ్ల పంపిణీ

- దూర ప్రాంతాల విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు
- విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగాలి
- ప్రవాస భారతీయుడు గాదె అరుణగోపాల్‌రెడ్డి సూచన



**కాకతీయ, పెద్దవంగర :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సైకిళ్లు పంపిణీ చేసినట్లు ప్రవాస భారతీయుడు గాదె అరుణగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాదె అరుణగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు భవనం నిర్మించి ఇవ్వడంతో పాటు రూ.5 లక్షల విలువైన వాటర్ ప్లాంట్ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు రూ.1.50 లక్షల విలువైన 21 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చిన్నప్పుడే లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగిశెట్టి రమేష్‌కుమార్, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ ఎం.వి. గోనారెడ్డి, అధ్యక్షులు మట్ట రాజేశ్వర్, కార్యదర్శి వినీల్‌రెడ్డి, గద్దం వేణుగోపాల్‌రెడ్డి, సంధ్య గ్రామ పార్టీ అధ్యక్షులు బిక్షపతి, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీను, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సింహాద్రి, సోమయ్య, అజయ్, శిల్ప, మహేందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు తావివ్వొద్దు.

- నిమజ్జన వేళ అప్రమత్తత అవసరం
- వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

**కాకతీయ, రాయపర్తి:** వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సూచించారు. సోమవారం రాయపర్తి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని చెరువులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. చీకటి పడకముందే నిమజ్జనం పూర్తి చేయాలని, ఘాట్ల వద్ద భద్రత, లైటింగ్, రోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశించారు. శోభాయాత్రలో డీజే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులు, యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వై. సంజీవరావు, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో పాక శ్రీనివాసులు, ఎంపీఓ కూచన ప్రకాష్, గిర్దావర్ చంద్రమోహన్, ఎస్సై ముత్యం రాజేందర్, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ నాయక్, జీపీఓ సురేష్, కారోబార్ కారుపోతుల రామచంద్రయ్య, ముద్రబోయిన రాజు పాల్గొన్నారు.



# తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్ట్

- డబ్బుల విషయంలో గొడవలే హత్యకు కారణం
- ఏసీపీ మామునూరు ఎన్. వెంకటేష్
- గరీబ్‌నగర్ మర్డర్ కేసులో నిందితుడి అరెస్టు




**కాకతీయ, గీసుగొండ :** గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గరీబ్‌నగర్‌లో తమ్ముడిని కత్తితో పొడిచి హత్య చేసిన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఏసీపీ మామునూరు ఎన్. వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. 19092026 రాత్రి 21:30 గంటల సమయంలో అద్దె ఇంట్లో ఎలుబాక ప్రసాద్ (31) కత్తిపోట్లకు గురై మృతి చెందాడు. మృతుడి తల్లి ఎలుబాక సుజాత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ప్రసాద్ అన్న ఎలుబాక ప్రవీణ్ (33) నిందితుడిగా గుర్తించారు. తల్లి వద్ద డబ్బులు అడిగే విషయంలో గతంలో ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న ప్రవీణ్ తమ్ముడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. 19వ తేదీ రాత్రి తల్లి నైట్ డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంటికి వెళ్లిన ప్రవీణ్ ప్రసాద్‌తో గొడవపడి, తాను తయారు చేసుకున్న కత్తితో వీపు, ఛాతి, భుజంపై పలుమార్లు పొడిచినట్లు తెలిపారు. దాడి అనంతరం నిందితుడు తన తల్లిని కూడా బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. 20092026 తెల్లవారుజామున తన బొటనవేలికి అయిన గాయానికి ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స తీసుకున్నాడు. 21092026న ప్రవీణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని సమాచారం మేరకు పొదల్లో దాచిన హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్‌జోన్ క్లూస్ టీమ్ శాస్త్రీయ ఆధారాలు సేకరించింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# ఆశ్రమ పాఠశాలలో ఆగని అలజడి

- గిరిజన బాలికల హాస్టళ్లలో ఏం జరుగుతోంది..?
- కరువవుతున్న భద్రత.. పర్యవేక్షణ గాలికి
- స్టడీ అవర్స్‌లో కర్రతో కొట్టిన లీడర్ విద్యార్థి.. ముగ్గురికి అస్వస్థత
- అర్ధరాత్రి విద్యార్థుల ఫోన్‌తో వెలుగులోకి ఘటన
- వార్డెన్ తీరు పై తల్లిదండ్రుల ఆగ్రహం
- వరుస ఘటనలతో హాస్టళ్ల నిర్వహణపై ప్రశ్నలు
- పర్యవేక్షణ లోపాలతోనే ఘటనలు పునరావృతం
- బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటున్న తల్లిదండ్రులు








**కాకతీయ, ఏటూరునాగారం:** గిరిజన బాలికలకు రక్షణగా నిలవాల్సిన ఆశ్రమ పాఠశాలలో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థినుల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాల్సిన సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆదివారం రాత్రి ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హాస్టల్‌లో ఘటన చోటుచేసుకుంది. స్టడీ అవర్స్‌లో చదవడం లేదంటూ 9వ తరగతికి చెందిన లీడర్ విద్యార్థిని ముగ్గురు విద్యార్థినులను కర్రతో కొట్టింది. దీంతో 6వ తరగతికి చెందిన ఒకరు, 7వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భయానికి గురైన విద్యార్థినులు తీవ్రంగా ఏడవడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ముగ్గురినీ ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

**వార్డెన్ ముందే వెళ్లడంతో..**

ఘటన జరిగిన సమయంలో హాస్టల్ వార్డెన్ లింగయ్య అందుబాటులో లేకపోవడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ తన విధులు ముగియడానికి సుమారు అరగంట ముందే హాస్టల్ నుంచి వెళ్లిపోయి, విద్యార్థినుల బాధ్యతలను నైట్ వాచ్‌మెన్‌కు అప్పగించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అదే సమయంలో హాస్టల్‌లో స్టడీ అవర్స్ కొనసాగుతున్నాయి. ముగ్గురు విద్యార్థినులను కర్రతో కొడుతున్న సమయంలో నైట్ వాచ్‌మెన్ అడ్డుకోలేదని బాధిత విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. విద్యార్థినుల భద్రత, పర్యవేక్షణ బాధ్యతలు ఉన్న సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడం, బాధ్యతలను వాచ్‌మెన్‌కు అప్పగించి వెళ్లడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అర్ధరాత్రి తల్లిదండ్రులకు విద్యార్థుల ఫోన్**

ముగ్గురు విద్యార్థినులను కర్రతో కొట్టిన ఘటనపై హాస్టల్ నిర్వాహకుల నుంచి తమకు ఎలాంటి సమాచారం అందలేదని తల్లిదండ్రులు తెలిపారు. రాత్రి 1-2 గంటల సమయంలో తోటి విద్యార్థినులు వేరే వ్యక్తి ఫోన్ ద్వారా విషయం తెలియజేయడంతోనే ఘటన తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో సోమవారం ఉదయం తల్లిదండ్రులు హుటాహుటిన హాస్టల్‌కు చేరుకుని తమ పిల్లల పరిస్థితిని తెలుసుకున్నారు. ఘటనపై తల్లిదండ్రులు ప్రశ్నించడంతో భయాందోళనకు గురైన లీడర్ విద్యార్థిని తన మణికట్టును చాకుతో కోసుకుంది. దీంతో అక్కడ కొద్దిసేపు ఆందోళనకర పరిస్థితి నెలకొంది. తమ పిల్లలపై జరిగిన ఘటన గురించి సకాలంలో సమాచారం ఇవ్వకపోవడం, హాస్టల్ నిర్వహణ, వార్డెన్ తీరుపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వరుస ఘటనలతో హాస్టళ్లపై ప్రశ్నలు**

ఇదిలా ఉండగా.. ఈ నెల 7న ఏటూరునాగారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌లో తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల సమస్యలపై విద్యార్థినులు ఆందోళనకు దిగారు. సమస్యలను ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టి ప్రిన్సిపల్ కిరణ్మయిని మహబూబాబాద్ గురుకుల కళాశాలకు, మ్యాథ్స్ లెక్చరర్ తిరుపతమ్మను ఆసిఫాబాద్ జిల్లా జైనూరు గురుకుల కళాశాలకు బదిలీ చేయగా, కామర్స్ లెక్చరర్ అనితకు ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హాస్టల్‌లో ముగ్గురు విద్యార్థినులను లీడర్ విద్యార్థిని కర్రతో కొట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. రెండు ఘటనలు వేర్వేరు హాస్టళ్లలో జరిగినప్పటికీ, వరుసగా సమస్యలు వెలుగులోకి రావడం హాస్టళ్లలో పర్యవేక్షణ తీరును ప్రశ్నార్థకం చేస్తోంది. విద్యార్థినుల భద్రతను పర్యవేక్షించాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడం, బాధ్యతలను ఇతర సిబ్బందికి అప్పగించడం వంటి పరిస్థితులు పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపుతున్నాయి. పర్యవేక్షణ కరువుతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాలికల హాస్టళ్లలో నిరంతర పర్యవేక్షణతో పాటు విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తరం కాకతీయ WWW.KAKATIYANEWS.COM

బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఉన్నతంగా ఎదగాలంటే విద్య తప్ప మరో మార్గం లేదు. బీసీలకు జ్ఞానోదయం రావాలి. బీసీలు ఉద్యమించాలి. హక్కుల కోసం పోరాడాలి. అదే సమయంలో అగ్రవర్ణాలను కూడా దూరం చేయకుండా మన ఉద్యమాన్ని వారికి వివరించి, వారిని కలుపుకొని ముందుకు సాగాలి. అప్పుడే బీసీలకు న్యాయం దక్కుతుంది.. ఉద్యమాలకు సరైన మద్దతు లభిస్తుందని.. సక్సెస్ అవుతుంది' అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల అసెంబ్లీ సీటు కాంటెస్టెడ్ బీజేపీ అభ్యర్థి, ప్రముఖ వైద్యులు పగడాల కాళీ ప్రసాదరావు అన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన బాల్యం, కుటుంబం, చదువు, వైద్య ప్రస్థానం, సామాజిక అనుభవాలు, రాజకీయ రంగ ప్రవేశం, పరకాలతో తనకున్న అనుబంధం గురించి పంచుకున్నారు. ఆయన వెల్లడించిన అనేకానేక అంశాలు ఆయన మాటల్లోనే...!



# బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి

### ఆటలకు వెళ్లకుండా పుస్తకంతో కూర్చునేవాడిని

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాక నా స్వగ్రామం. మా నాన్న పగడాల వెంకటనర్సయ్య, అమ్మ వజ్రమ్మ. నాకు తమ్ముడు, చెల్లి ఉన్నారు. మా నాన్న టీచర్. ఆయన బదిలీ అయిన ప్రతిచోటికీ మా కుటుంబం వెళ్లాల్సి వచ్చేది. టెన్త్ వరకు గ్రామాల్లోనే చదువుకున్నా. పదో తరగతి చిట్యాలలో చదివా. ఇంటర్ పరకాలలో పూర్తి చేశా. మా నాన్నకు నన్ను డాక్టర్ చేయాలనే కోరిక ఉండేది. అందుకే నన్ను నిర్బంధంగా చదివించేవాడు. నా తోటి పిల్లలంతా ఆడుకోవడానికి వెళ్తే నేను మాత్రం బుక్ ముందేసుకుని కూసునేటోడిని. మా నాన్న ఎప్పుడైనా ఊరికి పోతే సంబురపడేది. అప్పుడు మా అమ్మను బతిమిలాడుకుని ఆటకు పోయేవాడిని'' అని తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. మా ఊరిలోని దొర కుటుంబాలను చూడటం కూడా నాకు చదువుపై ఆసక్తి పెరగడానికి ఒక కారణం. రిటైర్డ్ జడ్జి రఘునందన్‌రావు మా ఊరికి వచ్చినప్పుడు ఆయన్ను, ఆయన పిల్లలను చూసేందుకు ఊరంతా వెళ్లేది. వాళ్ల డ్రెస్సింగ్, ఇంగ్లిష్ మాట్లాడే తీరు మమ్మల్ని ఆశ్చర్యపరిచేది. నేను కూడా మంచిగా చదువుకుంటే ఈ స్థాయికి ఎదగవచ్చని అప్పుడే అనుకున్నా. అప్పటి నుంచి చదువుపై ఇంట్రెస్ట్ పెంచుకున్నా. మా తాత బుచ్చిరామయ్య ఓ టర్మ్ రేపాక గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశాడు. తాతకు నేనంటే చాలా ఇష్టం. మనవళ్లందరిలో నన్ను ప్రత్యేకంగా చూసుకునేవాడు. ఆయన గుర్తుగా ఉండేందుకు నా కూతురి కొడుక్కి ఆయన పేరే పెట్టుకున్నా. ఎంసెట్ రెండుసార్లు రాశా. కానీ నిరాశే ఎదురైంది. మూడో ప్రయత్నంలో సీటు సాధించా. కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, పీజీ పూర్తి చేశా. మొదట 2 సంవత్సరాలు ఏటూరునాగారంలో పనిచేశా. తర్వాత 12 సంవత్సరాలు ఎంజీఎంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశా. 1992లో నాకు పెళ్లయింది. నా భార్య స్వర్ణలత ఎంబీబీఎస్, డీజీఓ. నా క్యారెక్టర్, మా నాన్న టీచర్ అని మా మామ ఆకుల ఆనందం వెతికి మరీ పట్టుకుని పెళ్లి చేసిండు (నవ్వుతూ).

### ఈటలే నా రాజకీయ గురువు

రాజబోయిన యాకయ్య ద్వారానే ఈటల రాజేందర్‌తో నాకు పరిచయం ఏర్పడింది. ఈటల సహకారంతో మెడికల్ కాలేజీ ప్రారంభించా. కాలేజీ ప్రారంభోత్సవానికి కేసీఆర్ కూడా వచ్చారు. నా రాజకీయ గురువు ఈటల. ఎప్పటికైనా ఆయన వెంటే నా నడక ఉంటుంది. నాకు పరకాల టికెట్ రావడం వెనక ఆయనే ఉన్నారు. నేను ఆయన్ను టికెట్ కోసం ఫోర్స్ చేయలేదు. కానీ నా బాధ్యత మాత్రం ఆయనే తీసుకున్నారు. నేను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే..కాళీ ప్రసాద్ కూడా పోటీ చేస్తారని ఆయన ఒక కార్యక్రమంలో చెప్పారు. ఆ మాటతో అందరూ అవాక్కయ్యారు. ఈటల రాజేందర్ ప్రోత్సాహంతోనే పరకాల నియోజకవర్గంలో పనిచేస్తున్నా. పరకాల నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తున్నా. ఎన్నికల్లో చాలామంది ఓటర్లు నాపై నమ్మకంతో ఓటేశారు. ఎన్నికల్లో ఓడిపోయానని బాధపడలేదు. అయితే బీసీలు అంతమంది ఉన్నా.. బీసీ బిడ్డను నన్ను కాదని అగ్రవర్ణాలను ఆదరించడం బాధగా అనిపించింది. అయినా నేను నియోజకవర్గంతోనే ఉన్నా. రిజల్ట్ మరుసటి రోజు నుంచే పరకాల ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నా. ప్రజలకు కూడా అర్థమైంది. నాకు వస్తున్న ఆదరణ, ప్రజల మాటలు వింటుంటే వచ్చే ఎన్నికల్లో తప్పకుండా ఆశీర్వదిస్తారనే నమ్మకం పెరిగింది.

విద్యతోనే బీసీలు ఉన్నతమైన ఎదుగుదల సాధ్యం

హక్కుల సాధనకు గళం విప్పాలి.. చేతనైనా పోరాటం చేయాలి

రాజకీయాలను అసహ్యించుకుంటే ఏం ప్రయోజనం.. ఇక మార్పు ఎలా సాధ్యం..?!

బీసీ ఉద్యమం అంటే ఓసీలను వ్యతిరేకించడం కాదు.. మన హక్కులే లక్ష్యం కావాలి

కనిపించని కుల వివక్షే నాలో కసిని పెంచింది.. ఈ స్థాయికి చేర్చిది

వైద్యుడిగా పేదలకు న్యాయం చేయాలన్నదే నా సిద్ధాంతం

ఈటలే నా రాజకీయ గురువు.. ఆయన వెంటే నా నడక

పరకాల ప్రజలతోనే నా రాజకీయ ప్రయాణం

డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో బీజేపీ పరకాల కాంటెస్టెడ్ అభ్యర్థి, ప్రముఖ వైద్యుడు పగడాల కాళీ ప్రసాద్‌రావు

### నేడు నాడి పట్టే డాక్టర్ కరువయ్యాడు

ప్రస్తుత వైద్యం ఆందోళనకరంగా మారింది. డాక్టర్లు పేషెంట్లకు దూరమయ్యారు. మిషన్లు, డబ్బులు దగ్గరయ్యాయి. నాడి పట్టుకునే డాక్టర్ లేకుండా పోయాడు. అందరిలో మార్పు వచ్చింది. టెస్టులు చేయకపోతే రోగులు అయ్యో అనే ఆందోళన చెందుతున్నారు. గతంలో నాడి పట్టుకుని, రోగి వివరాలు అడిగి సమస్య తెలుసుకుని వ్యాధిపై అంచనాకు వచ్చి చికిత్స చేసేవారు. ఇప్పుడు చికిత్స ఖర్చు పెరిగింది. భవిష్యత్‌లో డాక్టర్ల వ్యవస్థ మరింత పతన స్థాయికి వెళ్లే ప్రమాదం ఉంది. ఇది చేదు నిజం. '2008లో గార్డియన్ ఆస్పత్రికి స్టోన్ పడింది. ములుగు రోడ్డులో ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించినప్పుడు చాలామంది నన్ను చూసి నవ్వుకున్నారు. 'ఇక్కడ ఏం డెవలప్‌మెంట్ ఉంటుంది' అని నిరుత్సాహపరిచారు. కానీ నాకు ఉన్న విజన్‌తో ఆస్పత్రి కట్టా. నేడు సక్సెస్ అయ్యా. 2010లో నా ఉద్యోగానికి రాజీనామా చేసి గార్డియన్ ఆస్పత్రి ప్రారంభించా. నేను ప్రారంభించినప్పుడు ఈ ఆస్పత్రి చాలా పెద్దది. ఇప్పుడు మిడిల్‌కు వచ్చింది. పేషెంట్లకు 24/7 అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఆస్పత్రి పై ఫ్లోర్‌లోనే ఇల్లు ఏర్పాటు చేసుకున్నా. ఉద్యోగ ప్రస్థానం నుంచి ఇప్పటి వరకు ప్రతిరోజూ రాత్రి 11 గంటల వరకు పేషెంట్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి సమస్య తెలుసుకుంటా.

### ఎంబీబీఎస్‌లోనే కులం గురించి తెలిసింది

ఇంటర్ వరకు నాకు కులం అంటే పెద్దగా తెలియదు. ఎంబీబీఎస్‌లో చేరిన తర్వాతే కులం గురించి తెలుసుకోవాల్సి వచ్చింది. ఉన్నత విద్యలో కుల వివక్ష ఉంటుందని అప్పుడే తెలిసింది. నేను ఎంబీబీఎస్‌లో కుల వివక్షతో ఎంతో బాధపడ్డా. కొంతమందికి నమస్తే పెడితే వాళ్లు స్పందించేవారు కాదు. ఎందుకు పట్టించుకోవడం లేదని ఆలోచించేవాడిని. నా డ్రెసింగ్ వల్లనా అనుకునేవాడిని. కుల వివక్ష గురించి పూర్తిగా తెలుసుకోవడానికి ఏడాదిపైనే పట్టింది. అగ్రవర్ణాల విద్యార్థులు గ్రూపులుగా ఉంటారని తర్వాత తెలిసింది. వాళ్లకు వాళ్లకు నమస్తేలు పెట్టుకోవడం, సహకరించుకోవడం, పార్టీలు చేసుకోవడం ఉండేది. ఎంబీబీఎస్‌లో నాకు ఎదురైన వివక్ష, బీసీలపై కనిపించిన నిర్లక్ష్యమే నాలో మరింత కసిని పెంచింది. ఆ కసితోనే చదువులో ముందుకు వెళ్లా. అదే కసి నన్ను జీవితంలో, వైద్య వృత్తిలో రాణించేలా చేసింది. ఈ ప్రయాణంలో నా మిత్రుడు రాజబోయిన యాకయ్య చాలా కీలకంగా నిలిచాడు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన యాకయ్య నాకు మిత్రుడు మాత్రమే కాదు.. నా ఆత్మ. నేను, యాకయ్య కలిసి కష్టపడ్డాం. అన్నిట్లో నాకు ఆయన అండగా ఉండేవాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీలు మెడికల్ కాలేజీ చైర్మన్లుగా ఉన్న కాలేజీ మా ఆర్వీఎం ఒక్కటే. యాకయ్య నాకు దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాను.





### రేపాక నుంచి పరకాలకు సైకిల్‌పై

ఎన్టీఆర్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. 1983లో ఎన్టీఆర్ వస్తున్నాడని తెలిసి ఫ్రెండ్స్‌తో కలిసి రేపాక నుంచి సైకిళ్లపై పరకాలకు వచ్చినం. ఒక్కో సైకిల్‌పై ముగ్గురం వచ్చాం. టీడీపీ అంటే అభిమానం ఉండేది. యువరక్తం కదా.. ఆ పార్టీ నాయకులతో తిరిగేది. అయితే మా తాత కాంగ్రెస్ అభిమాని. నేను వాళ్లతో తిరుగుతుంటే తాత తిట్టేవాడు. 'మీ నాన్నకు ఉద్యోగం పెట్టించింది కాంగ్రెస్‌రా' అని చెప్పేవాడు. 2004 నుంచి 2014 వరకు మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశా.

కులం మద్దతు నాకు పుష్కలంగా ఉంది.

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉంది. అందుకేనేమో నా బుర్రలో పాలిటిక్స్.. పాలిటిక్స్ అని తిరుగుతూ ఉండేది. 2004లో 50 మంది డాక్టర్లతో కలిసి వినోద్‌కుమార్ సాయంతో కేసీఆర్‌ను కలిసి హన్మకొండ టికెట్ అడిగాం. కానీ పొత్తులో ఆ సీటు బీజేపీకి వెళ్లడంతో అవకాశం మిస్ అయింది. 2005 కార్పొరేషన్ హయాంలో మేయర్ చాన్స్ కోసం కూడా ఆఫర్ వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి కూడా ఆఫర్ వచ్చింది. పరకాలలో బీసీగా నన్ను బరిలో దింపాలని ప్రయత్నాలు జరిగాయి. కానీ నా ప్రయాణం ఈటలతోనే అని చెప్పా. పాలిటిక్స్‌ను కూడా ఒక కోర్సులా చదువుతున్నా. కసితో ముందుకు పోతున్నా. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టమొచ్చినా ఆదుకుంటున్నా. మిగతా వాళ్లు వదిలేశారు. ఎన్నికల్లో నేను ఇచ్చిన హామీ మేరకు నా ఆస్పత్రికి వచ్చే వారికి బిల్లులు కూడా తగ్గిస్తున్నా. నేను రాజకీయాల్లోకి డబ్బు కోసం రాలేదు. డబ్బే కావాలంటే నాకు వైద్య రంగంలోనే సంపాదించుకోగలను. ప్రజలు ఆశీర్వదిస్తారనే నమ్మకం నాకు వచ్చింది. ప్రస్తుతం రాజకీయాల్లో డబ్బు పెట్టాలి.. సంపాదించుకోవాలనే ధోరణి ఉంది. అవి పోవాలి. రాజకీయాల్లోకి చదువుకున్న వాళ్లు రావాలి. డీలిమిటేషన్‌పై వస్తున్న ప్రచారం అంతా ఊహాజనితమే. మోదీకి, అమిత్‌షాకు తప్ప డీలిమిటేషన్ అంశం ఎవరికీ తెలియదు. అధికారిక నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై వస్తున్న ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

'నా బుర్రలో పాలిటిక్స్.. పాలిటిక్స్'

### వైద్యంతో గౌరవం.. ఐఎంఏలో మరో అడుగు

ఈ వృత్తితో నాకు ఎంతో గౌరవం వచ్చింది. 1997లో ఐఎంఏ మెంబర్‌షిప్ తీసుకున్నా. ఐఎంఏ ఏ సమావేశం పెట్టినా హాజరయ్యేవాడిని. 2023లో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశా. ఐఎంఏలో కీలకంగా ఉంటా. ఐఎంఏలో బీసీలు అధ్యక్షుడు కావాలంటే కష్టం ఉండేది. అలాంటిది సుగమం చేశా. నా ఇద్దరు బిడ్డలూ డాక్టర్లే. పెద్ద కూతురు తేజస్వీ ఎంఎస్ ఆప్తల్మాలజీ, అల్లుడు అనురాగ్ ఆర్థోపెడిక్ డాక్టర్. చిన్న కూతురు యశస్వి ఎండీ జనరల్ పూర్తి చేసింది. రానున్న కొద్ది రోజుల్లోనే హాస్పిటల్‌ను మరింత డెవలప్ చేసి వాళ్లకు అప్పగిస్తా.



ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266